క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి


నివాళులర్పిస్తున్న కాకర్ల కృష్ణారెడ్డి

దొనకొండ: స్థానిక బేతేలుపురానికి చెందిన గోనా సామ్యేలు (49) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని పార్టీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి గురువారం పరామర్శించారు. సామ్యేలు భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న సామ్యేలు కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ గుంటు జాకోబు, గుంటు పోలయ్య, తమ్మనేని సుబ్బారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇండ్ల శ్రీనువాసులు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు పత్తికొండ వెంకట సుబ్బయ్య, పులిమి శివ, కె.ప్రసాద్, గుడిపాటి నాసరయ్య, గురువయ్య ఉన్నారు.

కారంచేడు మృతులకు నివాళి


కారంచేడు మృతులకు నివాళులర్పిస్తున్న నాయకులు

కురిచేడు: స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ సర్కిల్లో ఎమ్మార్పీఎస్ టౌన్ సభ్యుడు కంభంపాటి జోసెఫ్ మాదిగ, కంభంపాటి ప్రశాంత్ మాదిగ నేతృత్వంలో గురువారం కారంచేడు మృతులకు నివాళులర్పించారు. వికలాంగుల సంఘ అధ్యక్షుడు కంభంపాటి అనిల్ మాదిగ మాట్లాడుతూ కారంచేడు సంఘటన జరిగి 40 ఏళ్లు గడిచిందని గుర్తు చేశారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టాలు బలంగా ఉండాలని డిమాండ్ చేశారు. ఎంఎస్పీ నాయకుడు కంభంపాటి సాయన్న మాదిగ మాట్లాడుతూ కారంచేడు ఘటన మరువక ముందే చుండూరు ఘటన జరిగిందని, వీటన్నింటికీ కుల వ్యవస్థే కారణమన్నారు. మాతంగి సాయన్న మాదిగ, కంభంపాటి లక్ష్మణ్ మాదిగ, జి.ప్రసన్న మాదిగ, ఎల్.చిట్టిబాబు మాదిగ, ఎస్.తిమోతి మాదిగ, పి.చరణ్ మాదిగ పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దు


వాహనదారుల పత్రాలు పరిశీలిస్తున్న ఆర్టీఓ మాధవరావు

పెద్దారవీడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మార్కాపురం ఆర్టీఓ మాధవరావు అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడులో ద్విచక్ర వాహనాలను ఆకస్మికంగా గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. వాహనదారులను ఆపి హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలు వివరించారు. తనిఖీలో భాగంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న ముగ్గురికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ అనేది ప్రమాద సమయంలో ప్రతి ఒక్క వాహనదారుడికి అస్త్రంలా ఉపయోగపడుతుందన్నారు. హెల్మెట్ ధరించడం ప్రమాదానికి దూరం చేయడమేన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే తలకు తీవ్ర గాయాలు అవడం వల్లే అత్యధిక శాతం ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారని చెప్పారు. మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. విద్యార్థులు, యువత తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

జాబ్‌మేళాలో ఆరుగురు విద్యార్థుల ఎంపిక

దొనకొండ: దర్శిలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆరుగురు ఎంపికైనట్లు కళాశాల అడ్మిన్ కె.నాని తెలిపారు. కె.రేవంత్, పి.ఇస్సాక్, వై.నాతన్, ఎం.ఉదయ్‌కిరణ్, జి.నరసింహారాజు, ఎస్.సువర్ణ ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ కె.గుండారెడ్డి, డైరెక్టర్ నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ రవి, రాజశేఖరరెడ్డి అభినందించారు.

అధైర్యపడకండి..అండగా ఉంటా!

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


సోము దుర్గారెడ్డి తండ్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి


వీరాంజనేయులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి: ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా అండగా ఉంటానని కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని కొత్తరెడ్డి పాలెంలో పార్టీ కార్యకర్త చల్లా వీరాంజనేయులు కుమారుడు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆయన గురువారం పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని, అధైర్య పడవద్దని చెప్పారు. అనారోగ్య కారణంతో బాధపడుతున్న వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి తండ్రిని పరామర్శించారు. హైదరాబాద్‌లో ప్రమాదంలో గాయపడి మంచంలో ఉన్న బండి వెలిగండ్లకు చెందిన మామిడికాయల నాగరాజును పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారికి ఆర్థిక సాయం అందించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలర్ ఆవుల జ్యోతి శివారెడ్డి, మేడగం బాలకృష్ణారెడ్డి, నాగార్జునరెడ్డి, శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భారాలు మోపడం సుపరిపాలనా?

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

దర్శి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల నాడు ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలపై భారాలు మోపడం సుపరిపాలన ఎలా అవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు ప్రశ్నించారు. గురువారం సుందరయ్య భవన్‌లో సీపీఎం కమిటీ సమావేశం ఉప్పు నారాయణ అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ప్రయాణం × జల వైపా..కార్పొరేటర్ల వైపా? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే సంక్షేమ పథకాలు రెట్టింపుగా అమలు చేస్తామని, సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్లని చెప్పిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల నాటి హామీలు ఒకటి రెండు తప్ప మిగిలినవి అమలు చేయకుండానే సంబరాలు జరుపుకోవటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ అమలు చేసి కొన్ని అసలు ప్రారంభించలేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క కొత్త ఉద్యోగం ఇవ్వలేదన్నారు. ఉద్యోగాలు వచ్చేలోపు నిరుద్యోగులందరికీ రూ.3 వేలు ఇస్తామన్న భృతి ఎప్పుడు ఇస్తారో సంవత్సరం గడిచినా ఇంతవరకు చెప్పలేదన్నారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది ఆడబిడ్డలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్న పథకం ప్రస్తావన లేదని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏడాది గడిచినా అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. భరోసా ఎప్పుడు ఇస్తారని రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని, వారికీ మొండి చెయ్యే చూపించారన్నారు. తల్లికి వందనం పథకం గతేడాది ఇవ్వలేదని, ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.2 వేలు కోత కోసారని విమర్శించారు. దీపం పథకం మాటలకు ఆచరణకు పొంతన లేకుండా ఉందని ఎద్దేవా చేశారు. చెప్పిన హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచుతూ, ఆస్తి పన్ను, నిత్యావసర వస్తువుల ధరల భారాలు ప్రజల మీద మోపటం అన్యాయమన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమన్న మంత్రి లోకేష్ నేడు బలవంతంగా అవే మీటర్లు పెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, పేదల సాగులోని భూములు కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాండవ రంగారావు మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోని దొనకొండ కారిడార్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్న మాట ఏడాది గడిచినా అమలులోకి రాలేదన్నారు. ఒక వైపు రైతులు ఏ పంట వేసినా గిట్టుబాటు ధర లేదని, ఈ ప్రాంతంలో రైతులు వేసిన వరి, మిర్చి, పత్తి, పొగాకు పంటలకు గిట్టుబాటు ధర లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయనందున ఏడాదికే ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని, ఇది ఆగ్రహంగా మారక ముందే ప్రభుత్వం స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్‌కే కాలేబాషా, ఆదినారాయణ, రమాదేవి, టి.లక్ష్మి, పి.పుల్లయ్య, జాన్ పాల్గొన్నారు .

కార్మికులు సమ్మెలో.. చెత్త వీధుల్లో..!


చెత్తను పోగు చేసి తగలబెడుతున్న కొబ్బరి బోండాల వ్యాపారి


కాలువ నుంచి తీసి రోడ్డుపై వేసిన వ్యర్థాలు


రోడ్డు మీదనే చెత్త కుప్పలకు నిప్పు


రాజానగర్‌లో వెలగని వీధిలైట్లు


దుకాణం ముందు పేరుకున్న చెత్త

గిద్దలూరు రూరల్: పట్టణంలో పారిశుధ్యం దారుణం తయారైంది. గిద్దలూరు పట్టణ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు 57 మంది, ఇంజినీరింగ్ విభాగంలో కార్మికులు 33 మంది మంగళగిరిలో ధర్నాకు హాజరయ్యారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెలోకి వెళ్లడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్, కుమ్మరాంకట్ట సెంటర్, కొమరోలు బస్టాండ్ రోడ్డు, ఆర్టీసి బస్టాండ్, గణేష్ నగర్ వంటి ప్రధాన రోడ్లు చెత్తతో నిండిపోయాయి. మంగళవారం దుకాణాల ముందు పేరుకుపోయిన చెత్తను వ్యాపారులే తొలగించుకుంటూ కనిపించారు. కొందరు వ్యాపారులు రోడ్డుపై చెత్త పోగు చేసి నిప్పు పెట్టారు. మరికొందరు వ్యాపారులు దుర్వాసన భరించలేక దుకాణాలు తెరవడమే మానుకున్నారు.

పట్టణంలోని నల్లబండ బజారు, రాచర్ల రోడ్డు, కృష్ణా థియేటర్ సమీపంలో గల సగిలేరు సప్లయ్ చానల్లో తొలగించిన పూడిక కుప్పలుగా వేసి, వారం రోజులుగా తొలగించలేదు. పట్టణంలోని విశ్వభారతి స్కూల్, కొంగలవీడు రోడ్డు, డీఆర్ఆర్ అపార్ట్‌మెంట్ వీధుల్లో చెత్త రోడ్ల మీద ఉన్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. పట్టణంలోని రాజానగర్‌లో పుట్టవద్ద రెండు విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు వెలగని కారణంగా రాత్రి సమయంలో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

నేడు బాబు ష్యూరిటీ..
మోసం గ్యారెంటీపై సమీక్ష

దర్శి: స్థానిక బీవీఎస్ఆర్ నిలయం వద్ద శుక్రవారం ఉదయం జరిగే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పేరుతో జరిగే దర్శి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల హాజరవుతారన్నారు. మండలంలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్లు, కౌన్సిలర్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ కమిటీల్లో పలు పదవుల్లో ఉన్న బాధ్యులు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సుపరిపాలన ఇదేనా?


కురిచేడులో పేరుకున్న చెత్త



కురిచేడు: సుపరిపాలన చేస్తున్నాం.. అన్ని పనులు ఆదర్శవంతంగా చేస్తున్నాం.. అభివృద్ధే అజెండాగా పనిచేస్తున్నాం.. అని చెప్పుకునే అధికార పార్టీ నాయకులు, అధికారులు ఒకసారి కురిచేడును పరిశీలించండి. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడు. గ్రామ పంచాయతీలో స్వీపర్లకు జీతాలు ఇవ్వలేమని, కొందరు మానుకోవాలని అధికారులు కార్మికులకు అల్టిమేటం జారీ చేశారు. గత ప్రభుత్వంలో కరోనా కష్ట కాలంలో కూడా ఒక్కరిని కూడా తొలగించకుండా అందరికీ పనికల్పించారు. కానీ నేడు ఉన్నట్టుండి కార్మికుల్లో కొందరు మానుకోవాలని పంచాయతీ అధికారులు ఆదేశించటంతో కార్మికులు అందరం మానుకుంటామని స్పష్టం చేశారు. అందులో భాగంగా గురువారం విధులకు డుమ్మా కొట్టారు. అయినా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదు. ఒక్క అధికారి కూడా కార్మికులను పిలిచి మాట్లాడి వారి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోక పోవడంతో గ్రామంలో చెత్తపేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కార్మికులతో చర్చలు జరిపి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

దర్శి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు మోపటం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం ముండ్లమూరు బస్టాండ్ సెంటర్లో సీపీఎం మండల నాయకులు పంటా ఏడుకొండలు అధ్యక్షతన ముండ్లమూరు మండల కమిటీ సమావేశం జరిగింది. ఆంజనేయులు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందుగా రాష్ట్రంలోని కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచేదే లేదని, వీలైతే తగ్గిస్తామని చెప్పారని గుర్తు చేశారు. నేటి విద్యాశాఖ మంత్రి లోకేష్ యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటన చేసి ఆనాటి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడుతోందని, ప్రజలపై భారాలు పెంచుతోందని, స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని, తమ ప్రభుత్వం వస్తే వాటిని పూర్తిగా తొలగిస్తామని నమ్మబలికి నేడు స్మార్ట్ మీటర్ల పెట్టకపోతే మాడు పగలగొడతామనటం దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. నేటి ప్రభుత్వం మోడీ చెప్పిన బాటలో నడుస్తోందని, మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆదానీ బాటలో నడుస్తోందని ఎద్దేవా చేశారు. స్మార్ట్ మీటర్లు తొలగించాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తగిన విధంగా స్పందించకపోతే 2000 సంవత్సరంలో జరిగిన పోరాటాన్ని మళ్లీ ప్రారంభిస్తామని హెచ్చరించారు. సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలోని వ్యాపార సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు ఈపాటికే స్మార్ట్ మీటర్లు పెట్టారని, తదుపరి ప్రతి ఇంటికి బిగించేటువంటి ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందన్నారు. విద్యుత్ భారాలు మోపే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యకర్తలు గాలి వెంకటేశ్వర్లు, బొమ్మతోటి రాజా రమేష్, సుబ్బారావు, హనుమయ్య, ఎస్‌కే మీరావలి, అంజయ్య పాల్గొన్నారు

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తాళ్లూరు: గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని విఠలాపురంలో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కైపు బయపురెడ్డికి విపరీతమైన కడుపునొప్పి వచ్చింది. ఆ నొప్పి తట్టుకోలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడిని తొలుత స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు ఆ తర్వాత ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ రమేష్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు.

సాయిబాబా మందిరంలో భక్తుల పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు:

మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.


భోజనశాలలో భక్తులకు అన్నదానం

సేవా కార్యక్రమాలే లక్ష్యంగా పని చేయాలి


ప్రమాణస్వీకారం చేస్తున్న మానవత కమిటీ సభ్యులు

దర్శి: సేవా కార్యక్రమాలే లక్ష్యంగా మానవత సభ్యులు పని చేయాలని ఆ సంస్థ కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మానవత స్వచ్ఛంద నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ధనిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సంస్థ ద్వారా చేసిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు వివరించారు. సీహెచ్సీ మెడికల్ అధికారి సుమన్, ఎంఈఓలు రఘురామయ్య, రమాదేవి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేస్తున్న మానవత సభ్యులను అభినందించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో సంస్థ పరిశీలకుడు యల్లమందారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత నటరాజ నృత్య కళా నిలయం చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. నూతన కమిటీలో చైర్మన్‌గా దేవతి ప్రసాద్, కో చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చీదెళ్ల బసవయ్య, సహాధ్యక్షుడు అడపాల గణేష్, ప్రధాన కార్యదర్శి గొర్రెపాటి వేణు, కోశాధికారి చింతా తిరుపతిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మెంబర్లుగా మస్తాన్, ఎన్వీ సుబ్బారెడ్డి, జే.సుశీలమ్మ, రోషారావు, వాసుదేవరెడ్డి, అన్నవరపు వెంకటేశ్వర్లు, మస్తాన్ నాయక్, మోషే, శేషారావు, సుబ్బారావు, జైహింద్‌రెడ్డి, లీగల్ అడ్వైజరీ కమిటీ గడ్డి శ్రీనివాసులు, మీడియా ప్రతినిధుల అడ్వైజర్ రాగిపిండి రామకోటిరెడ్డి, జిల్లా డైరెక్టర్‌గా కపురం శ్రీనివాసరెడ్డిలను ఎన్నుకున్నారు. అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.